క్లుప్తంగా

ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్



శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని జక్కపల్లి మోడల్ స్కూల్ ఒకేషనల్ కోర్స్ విద్యార్థులకు 10 రోజులపాటు ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఫర్హానా గురువారం తెలిపారు. దసరా సెలవులతోపాటు సాధారణ పని దినాల్లో విద్యార్థులకు పది రోజులపాటు ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే పట్టణంలోని ప్రకాష్ ఫొటో స్టూడియోలో ఫొటోగ్రఫీ, విమార్ట్ సూపర్ మార్కెట్‌లో భాగంగా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల్లో నైపుణ్యత పెంపొందించడానికే ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు



శివ్వంపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటతోపాటు అన్ని గ్రామాల్లో చిన్న బతుకమ్మ వేడుకలను మహిళలు ఉత్సాహంగా జరుపుకున్నారు. స్థానిక ఆలయాలు, కూడళ్లలో ఆట పాటలతో సందడి చేస్తూ బతుకమ్మలను చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.

నిరుపేదలకు టార్పాలిన్ల పంపిణీ



టార్పాలిన్లు పంపిణీ చేస్తున్న మోహన్‌నాయక్

హవేళీఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని మల్కాపూర్ తండాలో పూరిగుడిసెల్లో నివాసముంటున్న వారికి లీలా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ డాక్టర్ మోహన్‌నాయక్ టార్పాలిన్లను, కొంత నగదును అందజేశారు. ఇటీవల కురిసిన వర్షాలతో దెబ్బతిన్న ఇళ్లతోపాటు గుడిసెలో నివాసం ఉంటున్న వారికి తనవంతుగా సేవ చేయాలనే ఉద్దేశంతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెదక్ మండల కాంగ్రెస్ నాయకులు రమేశ్, రవి, శ్రీను, బాబు, పరమేశ్, నోముల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్‌కు నివాళి



పండిట్ దీన్‌దయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నర్సాపూర్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మాజీ అధ్యక్షుడు హైందవ సిద్ధాంతకర్త పండిట్ దీన్ దయాళ్ సేవలు మరువలేనివని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్ అన్నారు. గురువారం పండిట్ దీన్‌దయాళ్ జయంతిని పురస్కరించుకొని నర్సాపూర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బుచ్చేశ్‌యాదవ్, నాయకులు శంకర్, నగేష్, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని కొత్తపల్లిలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. బీజేపి మండల శాఖ అధ్యక్షుడు సంతోష్, జిల్లా కిసాన్ సెల్ మోర్చా అధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ దయాల్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బీకొండ రాములు, శంకరయ్య, నాగభూషణం, లక్ష్మణ్‌రావు, కోల మల్లేశ్, రాజేందర్, కుమార్, ఎండీ గౌస్,

పెండింగ్ కేసులు పరిష్కరించండి

డీఎస్పీ నరేందర్‌గౌడ్

చిన్నశంకరంపేట(మెదక్): తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ నార్సింగి పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పెండింగ్ కేసులను సత్వరం పూర్తిచేయాలన్నారు. గంజాయి అరికట్టే చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, నిఘా ముమ్మరం చేయాలని ఎస్ఐ సృజనకు సూచించారు.

‘డబుల్’ ఇళ్లకు దారేది?

- ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు
- జాతీయ రహదారి పక్క నుంచి వెళ్తే ప్రమాదాలకు ఆస్కారం



డబుల్ బెడ్రూం కాలనీకి వెళ్లే రోడ్డు దుస్థితి

రామాయంపేట(మెదక్): పట్టణ శివారులోని జాతీయ రహదారి పక్కన నిర్మించిన డబుల్ బెడ్రూం (కేసీఆర్ కాలనీ)కి వెళ్లడానికి దారి కరువైంది. దీంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నుంచి వెంకటేశ్వర కాలనీ మీదుగా వెళ్లడానికి తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మార్గం ఇటీవల కురిసిన భారీ వర్షాలతో దెబ్బతింది. దీంతో రోడ్డుపై ఇసుక మేటలు వేయడంతోపాటు ఎక్కడికక్కడ వర్షం నీరు నిలువడంతో కాలినడకన సైతం వెళ్లే వీలు లేకుండా రహదారి దెబ్బతిన్నది. దీంతో కాలనీవాసులు తమ ద్విచక్ర వాహనాలను దూరంగా నిలిపి కాలినడకన వెలుతున్నారు. కాగా జాతీయ రహదారిపై నుంచి వెళ్తే ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. జాతీయ రహదారి పక్క నుంచి అక్కన్నపేట రోడ్డును కలుపుతూ బైపాస్ రహదారి నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు కాగా, పనులు చేయలేదు. కాలనీకి ప్రత్యేకంగా రహదారి నిర్మించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

> **త్వరలో పనులు ప్రారంభిస్తాం**
>
> 
>
> ప్రభుత్వ ఆస్పత్రి నుంచి కేసీఆర్ కాలనీ వరకు తారు రోడ్డు నిర్మాణానికి గాను రూ. కోటి 20 లక్షలు మంజూరయ్యాయి. ఇవే కాకుండా మరో రూ. కోటి మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాం. రెండు, మూడు రోజుల్లో నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. త్వరలో పనులు ప్రారంభిస్తాం.
>
> – మహేశ్, ఏఈ, మున్సిపాలిటీ

సమన్వయంతోనే సమస్యలు పరిష్కారం

ఎమ్మెల్యే సునీతారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కొల్చారం(నర్సాపూర్): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే సునీత రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఎమ్మెల్యే రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఎంపీడీఓ రఫీక్ ఉన్నీసా అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామాల వారీగా పంచాయతీ కార్యదర్శులతో గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్లపై ఎమ్మెల్యే ఆరా తీశారు. అలాగే బతుకమ్మ పండుగ సందర్భంగా గాట్ల వద్ద సౌకర్యాలపై దృష్టి సారించాలన్నారు. ఈ సమయంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేసి ప్రజలకు సమస్యలు తలెత్తకుండా పనులను కొనసాగిస్తున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పోతిరెడ్డిపల్లి పంచాయతీ కార్యదర్శి భూమేష్ మాట్లాడుతూ.. బంగారం కుదవ పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. అనంతరం సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన 25 మందికి చెక్కులను అందజేశారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి, డీఈఓ రాధా కిషన్, తహసీల్దార్ శ్రీనివాస్ చారి, ఎంపీఓ కృష్ణవేణి, డిప్యూటీ తహసీల్దార్ నాగవర్ధన్, ఆర్ఐ ప్రభాకర్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను జిల్లా, రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే సునీతా రెడ్డి తెలిపారు. గురువారం కౌడిపల్లి రైతువేదికలో మండల అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళ కార్యదర్శి మాట్లాడుతూ మండల కార్యాలయంలో టాయిలెట్స్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే మహిళలకు కనీస సౌకర్యం లేకపోవడం బాధాకరమని, టాయిలెట్ మంజూరు చేయిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ జహీర్, ఎంపీఓ కలీముల్లా, ఎంఈఓ బాలరాజు, ఏఓ స్వప్న, ఏఈలు అరవింద్, మారుతి, గులాం మోహియొద్దీన్, పశువైద్యాధికారి ఫర్హిన్‌ఫాతిమా, ఆర్ఐ శ్రీహరి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాలకు దరఖాస్తుల స్వీకరణ

హవేళీఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన అర్హత గల రైతుల నుంచి రాయితీపై వ్యవసాయ పరికరాలు అందజేసేందుకు దరఖాస్తులు చేసుకోవాలని ఏఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. బ్యాటరీ స్ప్రే, పవర్ స్ప్రేయర్, రోటోవేటర్స్, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్ వాటి కోసం 29లోపు మెదక్ ఏఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టా పాస్‌బుక్, బ్యాంకు అకౌంట్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

నేడు ప్రజాదర్బార్

హవేళీఘణాపూర్(మెదక్): మెదక్ ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్వహించిన ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీల్లో భాగంగా ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్ తెలిపారు. కార్యక్రమానికి అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు విధిగా హాజరు కావాలని కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

పెద్దశంకరంపేట(మెదక్): గర్భిణులు, బాలింతలతో పాటు మహిళలందరూ పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత అన్నారు. గురువారం పెద్దశంకరంపేటలోని పూసలగల్లీ 9వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాల ఆహార వారోత్సవాల సందర్భంగా తల్లిపాల విశిష్టత, మాతాశిశు సంరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై వివరించారు. అంగన్‌వాడీ సెంటర్ల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సరళ, సుక్కమ్మ, విజయలక్ష్మి, అనురాధ, జానాబాయి, విజయలక్ష్మి, అంబమ్మ, శివరాణి, స్వాతి తదితరులున్నారు.

చినుకు పడితే.. రాకపోకలు బంద్



బైక్‌పై వాగులో నుంచి ప్రయాణిస్తున్న గిరిజనులు

నర్సాపూర్ రూరల్: చినుకు పడిన ప్రతిసారి ఈ రోడ్డుపై రాకపోకలు బంద్. అత్యవసర సమయంలో నరకమే.. మండలంలోని తిరుమలాపూర్, ఖాజీపేట గిరిజన తండాలకు వెళ్లే రోడ్డు నెల రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలుచోట్ల కోతకు గురైంది. రెండు చోట్ల వాగులు పొంగడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. రెండు తండాలతో పాటు మంతుర్, ఖాజీపేట గ్రామాల పంట పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిరుమలాపూర్, ఖాజీపేట తండాలకు చెందిన గిరిజన గర్భిణులు, బాలింతలు, వద్ధులు, వికలాంగులు అనారోగ్యాలకు గురైై ఆస్పత్రులకు వెళ్లాలంటే నరకయాతన పడుతున్నారు. ఇతర అత్యవసర సేవలను వినియోగించుకోలేక పోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుకు కాళేశ్వరం ప్రాజెక్ట్ కాలువ, మరోవైపు వాగు ఉండడంతో వర్షం పడిన ప్రతిసారి రోడ్డు కోతకు గురవుతోంది. దీనికి తోడు రెండుచోట్ల వాగుకు కల్వర్టులు నిర్మించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

వరి పంట పరిశీలన



వరిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కౌడిపల్లి(నర్సాపూర్): నాణ్యమైన విత్తనం రైతన్న నేస్తం పథకం కింద వ్యవసాయశాఖ ద్వారా పంపిణీ చేసిన వరి విత్తనాలతో సాగు చేసిన పంటను గురువారం శాస్త్రవేత్తలు పరిశీలించారు. మండలంలోని కౌడిపల్లి, తునికి, నాగ్సాన్‌పల్లి గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులు ఎంటీయూ 1010 రకం వరి విత్తనాలను పలువురు రైతులకు పంపిణీ చేశారు. పీజేటీఏయూ (ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యునివర్సిటీ) శాస్త్రవేత్తలు అరుణశ్రీ, కిరణ్‌బాబు, నత్నాయపల్లి శాస్త్రవేత్త లక్ష్మణ్ గ్రామానికి వచ్చి క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. వరిపంట ఎలాఉంది, ఎరువులు ఏ మోతాదులో చల్లారు. తెగులు, చీడపీడలు ఏమైన వ్యాపిస్తున్నాయా అంటు రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. ప్రస్తుతం వరిపంట ఈనివంగేదశలో ఉందని రైతులు ప్రతిరోజు పంటను పరిశీలించి జాగ్రత్తగా వహించాలన్నారు. చీడపీడలు ఆశించినట్లయితే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త రవికుమార్, ఏఓ స్వప్న, ఏఈఓలు సాహితి, స్రవంతి, నరేందర్, రైతులు కొర్రశ్రీను, రాములు, బాబయ్య, ముర్షద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



కేసుల వివరాలు పరిశీలిస్తున్న డీఎస్పీ

డీఎస్పీ ప్రసన్నకుమార్

అల్లాదుర్గం(మెదక్): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నామని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ చెప్పారు. గురువారం అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ తనిఖీ చేసి.. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 161 హైవేపై రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయన్నారు. నేరాలు, దొంగతనాలకు సంబంధించిన కేసులను తరగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ రేణుకారెడ్డి, ఎస్ఐ శంకర్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



కాంగ్రెస్ నేత రాజిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

నర్సాపూర్: స్థానిక మున్సిపాలిటీని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నగరాభివృద్ధి కింద రూ.15కోట్లు మంజూరు చేసిందని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి చెప్పారు. మున్సిపాలిటీకి నిధులు మంజూరు చేయించినందుకు గురువారం స్థానిక పార్టీ నాయకులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాభివృద్ధికి కృషి చేస్తున్నామని, ఇందులో భాగంగానే మున్సిపాలిటీకి నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశామని చెప్పారు. కాగా, ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో మున్సిపాలిటీలోని రాయరావు చెరువు, కోమటి కుంటలను సుందరీకరణ చేసే అవకాశం ఉందన్నారు. అలాగే ఆయా పథకాల కింద మరో రూ.30 కోట్లు మంజూరు చేయించి పట్టణ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని వివరించారు. అనంతరం నిధులు మంజూరు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వివేక్‌లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రిజ్వాన్, సొసైటీ చైర్మన్ రాజుయాదవ్, మండల అధ్యక్షుడు మల్లేష్, నాయకులు అజ్మత్ అలీ, లలిత, అశోక్, పాల్గొన్నారు.

చెరువు వద్ద ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు



చెత్తను తొలగిస్తున్న విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది

నర్సాపూర్: స్థానిక రాయరావు చెరువు వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డగోలుగా పారవేయవద్దని మున్సిపల్ కమిషనర్ రాంచరణ్‌రెడ్డి ప్రజలకు సూచించారు. గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు కాలేజీల విద్యార్థులు మున్సిపల్ సిబ్బందితో కలిసి ఏక్ దిన్, ఏక్ గంట, ఏక్ సాత్ పేరిట చెరువు పరిసరాలలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త తొలగింపు కార్యక్రమం చేపట్టారు. అలాగే చెరువు పరిసరాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించి డంప్‌యార్డుకు తరలించారు. అనంతరం స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. కమిషనర్‌తో పాటు పలువురు మున్సిపల్ ఏఈ కిష్టయ్య, ఇతర అధికారులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలతో ముందుకు సాగాలి



బోనాల్ గ్రామంలో ఫంక్షన్‌హాల్ ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్

ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): ఉపాధి అవకాశాలను ఎంచుకుని యువత ముందుకు సాగాలని దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని బోనాల్ గ్రామంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి గురువారం ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. యువత అవకాశాలను వినియోగించుకుని ఉపాధి మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. యువకులు తమ నైపుణ్యాలను ఉపాధి కోసం వినియోగించుకుని జీవితంలో బాగా స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, జిల్లా నాయకులు రాజిరెడ్డి, బిక్షపతితోపాటు పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమం వాయిదా వేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తపస్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్లం

చేగుంట(తూప్రాన్): స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రిసైడింగ్ అధికారులుగా విధులు నిర్వహించే ఉపాధ్యాయుల ఎన్నికల శిక్షణ కార్యక్రమాలు వాయిదా వేయాలని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్లం విజ్ఞప్తి చేశారు.గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...దసరా బతుకమ్మ పండుగ సెలవులతో ఉపాధ్యాయులు సొంత గ్రామాలకు వెళ్లారన్నారు. సంస్కృతీ సంప్రదాయాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాలు వాయిదా వేయాలని కోరారు. సమావేశంలో తపస్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, కార్యదర్శి కృష్ణగౌడ్, రామాయంపేట, చిన్నశంకరంపేట నాయకులు సంతోశ్‌కుమార్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం అభినందనీయం



మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ వెంకటయ్య

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామాల్లో సేహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి డాక్టర్ వెంకటయ్య అన్నారు. గురువారం చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లిలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. వెటర్నరీ డాక్టర్ గీతామాలిక, గోపాల మిత్రులు పశువులకు వైద్యం చేసి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటయ్య మాట్లాడుతూ.. గ్రామాల్లో పశుసంపద వృద్ధిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సెహగల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కెల్లా గౌతమ్, సభ్యులు మణిదీప్, రాఘవేందర్, కావ్య, చాంద్‌పాషా, విజయ పాల్గొన్నారు.

కాత్యాయని.. కాపాడు తల్లీ

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు గురువారం అమ్మవారు కాత్యాయని దేవి అవతారంలో దర్శనమిచ్చారు. దుర్గామాత మండపాలు, ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉపాసకులతోపాటు అధిక సంఖ్యలో మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు.



చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లిలో..



నర్సాపూర్: కామేశ్వరీ దేవిగా..



చేగుంట(తూప్రాన్): కర్నాల్‌పల్లి అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చన



కౌడిపల్లి: వెంకటాపూర్(బి)లో..



కొల్చారం(నర్సాపూర్): ఏటిగడ్డ మాందాపూర్‌లో..



పెద్దశంకరంపేట: గంగపుత్రయూత్ ఆధ్వర్యంలో పూజలు



టేక్మాల్: పల్వంచలో అమ్మవారికి పూజలు